# పెండ్లికట్నము

'వసంతమూర్తి'

"రామదాసూ! విశాఖపట్నము వెళ్లాలి? ఎప్పుడు?"

"ఎందుకమ్మా! విశాఖపట్టణము."

"ఎందు కేమిటి? నిన్న వారు వచ్చారు. ఎరగవూ? మంచిస్థితిపరులట. ఐదో, ఆరో వేలు చేత్తో పట్టుకున్నారుట."

"ఐతే మొద్దుపిల్లనికూడా తయారు చేశా రన్నమాట?"

"చూడకుండానే?— లేదు — నీకోసము చదువులసరస్వతి తయారౌతోంది, ఎక్కడో! కూర్చో వచ్చేదాకాను."

అంటూ మాఅమ్మ వెళ్లిపోయింది. ఆవిడకి కొత్తకోడలిముచ్చట ఎక్కువ.

*          *          *          *

"ఎందాకా నోయి. రామదాసూ?"

"నువ్వు?"

"వైజాగ్."

"నేను విశాఖపట్టణము."

"రెండూ ఒకటి కాదా యేమిటి?"

"అది ఇంగ్లీషువారి ఊరు. ఇది తెలుగువాళ్ల ఊరు."

"ఆరి నీ తస్సలమంనూ! చంపేస్తున్నావే! అందరూ నీలాగ భావకవు లై పోవా లంటా వేమిటి?"

"అబ్బే! రాధాకృష్ణమూర్తిలాగ కద్దరుకొట్టు పెట్టినా ఇంగ్లీషువాళ్లలాగ విశాఖపట్టణానికి 'వైజాగ్' అనీ, 'చూడలే' దని అనడానికి 'kindly excuse me' అనీ మొదలుపెట్టాలంటాను."

"అబ్బ! ఆపుమా లెక్చరు! నువ్వేనా? ఇంకెవరేనా వస్తున్నారా?"

"అదుగో మా అమ్మకూడా వస్తోంది."

"ఏమిటి విశేషాలు?"

"నువ్వెరగని విశేషా లేముంటాయి? బండి వస్తుంది గాబోలు. చదరంగం బరిణె కొందాం రా."

*          *          *          *

విశాఖపట్టణములో రైలాగినతర్వాత మా అమ్మ దగ్గిరికి వెళ్లి, పెట్టెలోంచి దింపి, "మనం వాళ్లింటికి వెళ్లక్కరలేదు. రాధాకృష్ణమూర్తికూడా వచ్చాడు. వీళ్లింటికి వెళ్లి కబు రంపుదాము" అన్నాను.

"ఇంకేం? పెళ్లయేదాకా వాళ్లెవరు, మన మెవరు? 'కతికితే అతక' దంటారు."

"ఏమండోయి పిన్నిగారూ? మీరు కదిలారు, ఉంది ఏదో విశేషము?"

"విశేషాని కేముందోయి? పిల్లని చూచుకోడానికి వచ్చాము. ఎవరో జనముంచి వారట!"

"ఒరేయి, కబుర్ల కేమి గాని, వాళ్లుకూడా వచ్చియుంటారు. త్వరగా పద. తరవాత చెప్పుకోవచ్చు" అని బయల్దేరించాను.

బయటికి వచ్చాము. రాధాకృష్ణమూర్తి బండీ వచ్చింది. మా అమ్మనిమాత్రము ఎక్కమని మేము నడవడ మారంభించాం.

"ను వ్వెక్కడ దొరికావురా వీళ్లకి?"

"ఏమో! కాలేజీకి వెళ్లి పేరు తిరగేశారేమో! అవును గాని ఏమిటి కబుర్లు?"

"పిల్ల తెలివైనదే. నాభార్య కృష్ణుడు వేస్తే సత్యభామ వేసిందట సూళ్లలు నాటకంలో.

"సంగీతము వచ్చునా?"

"శాస్త్రోక్తంగా నేర్చుకుందో లేదో తెలియదు. ఫిడేలు గాబోలు నేర్చుకున్నట్టుంది. మా యింట్లోని ఫొటోల్లో అదే ఉన్నట్టు జ్ఞాపకము, ఆ అమ్మాయి చేతుల్లో."

"ఏమోయి, రాధాకృష్ణమూర్తీ! ఏమిటోయి విశేషాలు? నీకు తెలుసునా వాళ్ల సంగతేమైనా?"

"మంచి సంబంధమేనండీ! సాంప్రదాయకులు; స్థితిపరులు."

"ముద్దూ ముచ్చటా జరిపే వారేనా?"

"ఆఁ, పుచ్చుకున్నవాళ్లు పెట్టడ మెరగరా యేమిటి? ఆపవోయి బండి.."

"అమ్మా!...తలుపు తియ్యి, చుట్టా లొచ్చారు."

ఆవిడ తలుపు తీసి: "ఓహో! ఏమోయి, ఇదేనా రావడం?"

ఇంతలో అమ్మ బండి దిగింది.

"ఓహో! మీనాక్షమ్మగారు, రండి. భానూ! రావాలి రావాలి" అని ప్రత్యుత్థానము చేశారు. నేను రాధాకృష్ణమూర్తితో మేడ ఎక్కుతున్నాను.

"స్నానము చెయ్యవురా?"

"ఊఁ, చెయ్యాలి!"

"వెంకన్నా, సబ్బు, టవలు నూతిగట్టుమీద పెట్టు.—'వేణ్ణీళ్లా? చన్నీళ్లా?' — 'చన్నీళ్లే'— రెండు బిందెల్లో నీళ్లు తోడు. త్వరగా." అంటూ రాధాకృష్ణమూర్తి దారి తీశాడు.

"ఒరేయి, మళ్లీ సాయంత్రం వెళ్లిపోవాలి. వెళ్లి చెప్పి రారాదూ?"

"మాయిరట్లో భోంచెయ్యకుండానే? సాయంత్రమూ లేదు, రాత్రీ లేదు. రేపు ప్రొద్దున్నే వెళ్లడము."

"ఎప్పుడో ఒకప్పుడూ. వచ్చినపని అయిపోతే మంచిదిగా?"

"అబ్బ. ఎంతతొందర్రా. అంత ఆదుర్దాగా ఉంటే, అదుగో అదే కాబోలు ఫోటో చూడు మురదు."

"ఏడిశావు. వెళ్లమూ పెద్ద కబుర్లు చెప్పక?"

"స్నానము చెయ్యి. నేను వెళ్లి వస్తాను" అంటూ అతను వెళ్లిపోయాడు.

ఆ గదిలో ఫోటోగ్రాఫులు చాలా ఉన్నాయి. రాధాకృష్ణమూర్తి ఇదివరకు చూపించిన వైపున ఉన్న ఫోటో తీశాను. మాస్టర్లకి ఒకవైపున రాధాకృష్ణమూర్తిభార్య భానుమతమ్మ ఉన్నది, రెండోవైపున ఎవరో అమ్మాయి ఫిడేలు చేత్తో పట్టుకుని కూర్చుంది. క్రింది పేర్లలో 'జ. కమల' అని వ్రాసివుంది. మరి సందేహము లేదు. ముఖములో అవలక్షణా లేవీ లేవు. కొంచెము వెలుగున్న కళ్లే. కుర్చీమీద కూర్చొని చూస్తున్నాను ఫోటో. అమ్మపిలుపు వినిపించింది. లేచి స్నానానికి వెళ్లాను.

* * * *

"రామదాసూ!"

"ఆఁ."

"రా మరీ."

"అమ్మ?"

"ఆవిడా వస్తున్నారు."

నాకు పైమెరుగు లిష్టములేదు. అందులో ఇటువంటి సమయాలలో అసలు మొగ్గను. ఇప్పుడు కళ్లు మూస్తే సరా? తరవాత మెటికవిరుపు లెవరు వినగలరు? తడిగుడ్డతో ముఖము రైలుమసి లేకుండా తుడుచుకుని తెల్లఖద్దరు బట్టలు వేసుకుని బయల్దేరాను. మాబండి వాళ్లింటిముందు ఆగింది. మేము దిగీ దిగడముతోనే, బండి చప్పుడు విని బయటికి వచ్చినవాళ్లలో పురోహితుడు కాబోలు, కాశ్మీరశాలువ కప్పుకుని వచ్చి, "దయచేయండి" అన్నాడు. గేటు కెదురుగా ఉన్న గుమ్మం దగ్గిర ఆడవాళ్లు నిలబడి ఉన్నారు. వారిలో ఒకరు మా అమ్మని "రండమ్మా! ఇలా రండి" అని ఆహ్వానించారు.

నేనూ రాధాకృష్ణమూర్తీ చావడిలో ప్రవేశించాము. మాకు వారు కుర్చీలు చూపించారు.

"మీరో ?" అన్నాను.

"నే నీకుర్చీలో కూర్చుంటాను. మీరిద్దరూ ఆ కుర్చీలలో కూర్చోండి" అన్నారాయన. మా కిచ్చినవి బెత్తు కుర్చీలు. అది పేము కుర్చీ. వీటిలో మెత్తలున్నాయి. దానిలో లేవు. పెద్దవారుండగా మేము పోషా లెక్కడ మేమిటని కొంచెము జంకాను. పురోహితు డిది గ్రహించి, "ఫరవాలేదు కూర్చోండి" అని కూర్చోపెట్టి, "అమ్మా!" అని తలుపుదగ్గర కేక వేశాడు.

నేను రాధాకృష్ణమూర్తితో "ఒరేయి, నాకేమని ఊరుకోక, కొంచెం పలకరించేం" అని గొణిగాను.

తలుపు కిర్రుమంది.

నేను ప్రక్కకి చూచాను. ఏదో పుస్తక ముంది కిటికీలో. దాన్ని తీసి పేజీలు తిరగవెయ్యడ మారంభించాను.

పురోహితుడు "స్టేషనుకి వచ్చాము, మీరు కనబడలేదు" అన్నాడు.

"ఈతనీ అమ్మగారు ఒప్పుకోలేదు. కతికితే అతకదట."

"అయితే అతికించే ప్రయత్నములో వున్నారన్నమాట. శుభమస్తు."

"ఈవూళ్లో ఆడపిల్లలకు బళ్లున్నవా ?"

"ఊఁ. అమ్మాయి ఆడపిల్లలబడిలోనే చదువుతోంది. ఏంస్కూలమ్మా ?"

"గవర్నమెంటు స్కూలే."

అంతవరకూ నామీద నున్నకళ్లు పురోహితుడు మీదికి తిరిగాయి నే నటు చూడగానే.

"మీ ఆవిడకూడా అక్కడే కదూ చదువుత ?" అని పిల్లతండ్రిగారు.

"ఊఁ."

"నువ్వేరుగుదువమ్మా ఆవిడని ?"

రాధాకృష్ణమూర్తినై పోక చిఱునవ్వు చూపి తండ్రివైపు తిరిగి, ఎరుగును నన్నట్లు తలవూపిన దామె. జడ పెద్దదే. నాగరం పెట్టారు.

"ఏం చదువుతున్నావమ్మా ?"

చూపు నామీదనుంచి దాటి పక్కకి తిరిగింది.

"సెకండు ఫారము."

"ఈ యేడాది బొమ్మలిచ్చారా ?"

"బొమ్మలా, పుస్తకాలా" అన్నాను.

"పుస్తకాలే ఇచ్చారు."

అనుకోని ఈ జవాబుకి నాకళ్లావైపు తిరిగాయి. ఆకళ్లు నాచూపుల బరువు కొంతవరకు భరించి వంగేయి.

"ఏవీ చూతాము."

ఆమె తండ్రివైపున బల్లమీదకి చూచి లేవబోయింది.

"నువ్వు కూర్చో, నేనిస్తా—ఇవేనా ?" 'ఊఁ.'

రాధాకృష్ణమూర్తి ఆయనచేతిలోంచి రెండు పుస్తకా లందుకున్నాడు. మనుచరిత్రము నా కిచ్చి, తన పుస్తకము "త్యాగరాజహృదయము" అని చదివి, "సంగీతములో ఇచ్చా రేమిటమ్మా" అన్నాడు.

"ఊఁ."

నా కిచ్చిన పుస్తకము అట్టకి వెనక "తెలుగు వ్యాసరచనలో" అని వ్రాసియున్నది.

"ఏదమ్మా నీ ఫిడేలు ? అచ్చమ్మా, ఫిడేలు తీసుకురా."

తలుపు కిర్రుమని, సందులోంచి ఫిడేలు ప్రవేశించింది.

"కమలా!"

"ఊఁ" అని అందుకుంది.

"నువ్వు వ్రాసిన పుస్తక మేదైనా పట్టుకురా అమ్మా!"

ఆపిల్ల అన్నయ్య కాబోలు, బీరువాలో వెతుకుతున్నాడు. "చిత్తుపుస్తకము తియ్యకు" అని కేక వినబడింది. అంతా నవ్వారు. ఆ కళ్లు నావైపు తిరిగి క్రిందికి వాలాయి. దస్తూరీ బాగానే ఉన్నది.

"ఫిడేలు తియ్యి చిట్టీ."

పాట ఏమంత బాగా లేదు.

"మీ యింట్లో సంగీతము ముందు పుట్టి తరువాత మీరు పుట్టారు. తప్పు లెంచకండి" అన్నాడు పురోహితుడు.

"పెళ్లి సంగీతములో తప్పు లెవ రెంచుతా ర్లెండి?"

తండ్రిగారు కుర్చీలో కదిలి,

"ఇదివరకు హార్మోనియము నేర్చుకునేది. ఈ మధ్యనే ఫిడే లందుకుంది."

"పాడవమ్మా." — "గట్టిగా."

అబ్బ. ఎంత కీచుగొంతు!

మెల్లిగా తలుపు కిర్రుమంది. సందులోంచి రెండు కళ్లు, ముక్కుపుడక కనపడ్డాయి. నన్ను తెత్తు కుర్చీమీద ఎదురుగా ఎందుకు కూర్చోమన్నారో ఇప్పుడు బోధపడింది. "అమ్మాయీ" అని చిన్న పిలుపు. ఆమె లేచి లోపలికి వెళ్లింది. మరికొంత సేపటికి ఎవరో అమ్మాయి ఫలహారాల పళ్లెముతో ప్రవేశించింది.

*    *    *    *

"శలవు. వెళ్లివస్తాము."

"వెళ్లి రండి."

చిన్న నవ్వొచ్చింది.

బండి కదిలింది. రాధాకృష్ణమూర్తి అందుకున్నాడు. "మరి కొంచెం తెలుపు ఉంటేనా?"

"అందాలకేం నాయనా? కులమింటి కోతిని చేసుకోమన్నారు."

"మీ కెప్పుడు చూపించారు?"

"నేను చూచిన తర్వాతే మీ దగ్గరకి పంపించారు."

"మీ అభిప్రాయ మేమిటండి?"

"పిల్ల కళ్లు మంచి వెల్తురుగా నున్నాయి. కాని యేమోయి, చాలాగొరక వాళ్లట?"

"ఎవ రన్నారూ?"

"వంటలక్క చెప్పింది."

"చూశారా! మాదిగముండ వాళ్ల ఉప్పు తిని—"

"'మొగవా డన్నవాడి కిచ్చేయాలని చూస్తున్నారు, పాపము, చేసుకోండి' అంది."

"అమ్మ లంజ! వీళ్లని పెట్టుకోమని ఉందా? తిన్న యింటికి వాసాలు లెక్కపెట్టుతారు."

"ఇదివరకు చాలామందిని వెతికారుట?"

"అవును. పిల్లకి ఎవరూ నచ్చలేదట."

"ఊ. పాపము! తాత కట్నమెంతో ఇవ్వనివ్వ లేదుట. బి. ఏ. ప్యాసవాలి కుర్రాడు. వీళ్లుమాత్రము కట్నమివ్వక్కర్లేదు. కుదిరిపోవాలి సంబంధాలు."

"మీ అమ్మాయి పెళ్లి కేమిచ్చారూ?"

"మాలాగ చెయ్యమనూ చూతాము, మే మే మిస్తే నేమి? పీడువేలు కర్చయాయి, మా అమ్మాయి పెళ్లికి."

"అందరూ ఇంజినీరుగారిలాగ నాలుగేసివందలు గడిస్తే ఆలాగు చెయ్య కేమి చేస్తారు?"

"ఏమి వీళ్లకి? సంబంధానికి వచ్చినప్పుడు సాలుకి నాలుగువేలు వస్తాయని చెప్పకోగలరేం?"

"అవన్నీ శుక్రనీతి లోకి వస్తాయి — 'వారి జాతులందు వైవాహికములందు......బొంకవచ్చు' లోవే!"

బండి ఆగింది. రాధాకృష్ణమూర్తిభార్యా, తల్లీ చావడిలో కూర్చున్నారు.

"అయాయా చూపులు?"

"ఆ అయాయి. రాయభారాలే తరవాయి."

"ఏమంటోంది పిల్ల?"

"చేసుకుంటే నేడో రేపో వస్తా నంటోంది."

"ఇంకేం, కుదిరిందన్నమాటే పెళ్లి."

"కుదిర్చేవారు కారట వాళ్లు."

"కాకేం, ముసలాడు నోరుమూసుకోవాలిగాని?"

"రాధాకృష్ణమూర్తిగారూ!"

"ఒరేయి, జాగ్రత, దొరక్క."

"ఏమోయి, వాళ్ల అభిప్రాయాలు కొంచెం కనుక్కో."

"కొంచెం ఏమిటి? శుభ్రంగా అడిగి రా! మరి సందేహా లెందుకు?"

*        *        *        *

"ఏమిటోయి విశేషాలు?"

"బోలెదు......వాళ్లందరికీ పిల్లవాడు నచ్చాడట."

"దొబ్బుడాయి. వీమి నచ్చక?"

"దానికేం? '...మీరేమన్నా'రని అడిగారు. 'సుముఖంగానే ఉన్నారు. కుదుర్చుకునే భారం మీదే' అన్నాను."

"భేష్. గడుసువాడివే!"

"'ఇదివర కేమైనా సంబంధాలు వచ్చాయా' అన్నారు."

"లేదు, వీళ్లకే ఉంది ఆడపిల్ల."

"అష్క్కే. కాదండీ. వాళ్లూ కట్నం విషయం గ్రహిద్దామనే వేశా రాప్రశ్న."

"అవునులే. ఏమన్నావు నువ్వు?"

"కాకినాడ తాసిల్దారుగారి మాట చెప్పాను."

"అమ్మ పిడుగా! ఈ తంత్రాలన్నీ ఎక్కడ నేర్చావోయి?"

"తంత్రాల కేముంది? అబద్ధమా నేను చెప్పినది?"

"అబద్ధమని కాదు. కాకినాడ తాసిల్దారుగారి మాట చెప్పడమేమి? నరేంద్రపురం హెడ్డుమాష్టారి మాట చెప్పకూడదూ?"

"రెండువేలవాళ్లమాట చెప్పడమేమి? నాలుగు వేల వాళ్లమాటే చెపుదాము."

"అదిగో, అందుకే నేనంట."

"ఊ, కానీరా కథ."

"'అమ్మో! నాలుగువేలే. అయితే మన కందరు వీళ్లు. ఎక్కడ తేనూ నాలుగువేలూ?' అన్నా డొక ముసలాయన, తాతగారట పిల్లకి."

"ఇందాకా రాలేదేం?"

"ఇంట్లో లేడట."

"తరవాత?"

"'మరి కుర్రవాడు బి. యె. ప్యాసయినాడు, తెలివైనవాడు. ఇదివరకు సంబంధాలు వచ్చినమీదట ఏర్పడిన అభిప్రాయముగాని, కొట్టుపెట్టినట్టు ఆరు సంచులుంటేనే మాకమ్మము ఎక్కండి. లేకుంటే వద్దనే రకము కాదు. పోనీ వాళ్లు వాళ్లపిల్లకి చేసినట్టు చెయ్యండి మీరు, చా' లన్నాను. దానితో ముసలాయన ఊరుకున్నాడు."

"ఊఁ."

"పిల్ల తండ్రిగారు 'ఇదివరకు సంబంధాలెందుకు వదిలేశారు?' అని అడిగాడు. దొరికిపోతా నన్కున్నాడు పాపం. 'ఏమో మీ పిల్లలాంటివాళ్లె నెవర్ని వ్రాశాడో బ్రహ్మదేవుడు.'

"అరిపిడుగా — గడుసుదేరేవే?"

" 'ఆపిల్లలికి సంగీతము రాదని మావాళ్లు వదిలేశా' డన్నాను. ఆ అమ్మాయి కదేలోపం, అలా అంటే వారు తొందరపడతారని సంగీతము సంగతి చెప్పాను."

"రాయభారాలు బాగా నడుపుతావు. నువ్వప్పు డుంటే భారతయుద్ధము జరగకపోవునేమో. సరే. మొత్తాని కేమిటి తేల్చా?"

"తేల్చడాని కేముంది? కట్నమంత ఇచ్చేటట్టు లేదు వాళ్లు."

"అంతంటే ఎంత?"

"మూడువేలేనా ఇవ్వరు."

"ఆహాఁ, ఏమిస్తారు?"

"రెండైతే ఏమో."

"చూశారా! దారుణం? కొడుకు పెళ్లికి నాలుగు వేలు పిండారు."

"మరేమిటనుకున్నారు. పుచ్చుకునే సరదా ఇచ్చేటప్పుడు ఉండదు."

*　　*　　*　　*

సాయంత్రము రాధాకృష్ణమూర్తీ, నేనూ బీచి షికారు వెళ్లాము. "వాళ్లింటి ముందునించి వెళ్దామా" అన్నాడు. "ఎలాగేనాసరే" అన్నాను. బయల్దేరాము. వాళ్లింటి తలుపులు మూసి ఉన్నాయి.

సందుమళ్లేటప్పుడు బడి వదిలిపెట్టారు కాబోలు. చాలామంది ఆడపిల్లలు వస్తున్నారు. మా స్నేహితుడి కళ్లు చురుకు.

"ఒరేయి, అదిగో నీలిపరికిణీ" అన్నాడు. అంత వరకూ ప్రక్కనున్న పిల్లలతో పకపకానవ్వుతూ మాట్లాడుతూన్న ఆపిల్ల మమ్మల్ని చూచి చప్పున ఊరుకుంది. నే నావైపు చూచినా కళ్లు వాలలేదు. సాహచర్య ప్రభావము! నాముఖాన్ని చిరునవ్వొచ్చింది, ఈ పరివర్తనానికి. సంధ్యారాగ మావరించింది ఆ ముఖాన్ని. మా స్నేహితుని చెల్లెలు 'రామదాసు మామయ్యా' అని నా మోకాళ్లు కాగలించుకుంది. "బజారు కెళ్తున్నాను. బిసకత్తులు తెస్తాను. ఇంట్లోనే ఉండు వెళ్లు వెళ్లు" అని

వదిలించుకునేసరికి వాళ్లందరూ సందు మళ్లారు. చిన్నపిల్ల పరుగెత్తి వారిని చేరింది. ఆపిల్ల చిన్నపిల్లకోసరము సందుచివర ఆగింది.

*　　*　　*　　*　　*

విశాఖపట్నమునుంచి వెళ్లేటప్పుడు "ఒరేయి, పరిస్థితులు ఎలాగున్నాయో వ్రాయేం?"

"చెప్పాలా నువ్వు? వాళ్లు మాతపిడికిలివారురా. అదేమైనా అడ్డుతగులుతుందేమో చూద్దాము. ఇంతకీ దైవఘటన ఎలాగుందో అలా జరగక తప్పదుగదా?"

*　　*　　*　　*　　*

నాలుగురోజులైన తర్వాత నేనూ మా వెంకట్రావూ ఉప్పాడ దీపగృహము చూచి తిరిగి వస్తూంటే వారి పురోహితుడు కనపడి "ఏమండోయి అబ్బాయిగారూ! ఎక్కణ్ణుంచి?"

"నమస్కారాలు."

"శీఘ్రమేవ వివాహసిద్ధిరస్తు."

"తాహతుకి తగిన కట్నమిస్తే తథాస్తు."

"ఏమిరోయి?"

"తప్పా యేమిట్రా?"

"ఏమండీ, ఏమిటి కబుర్లు?"

"మీరే చెప్పాలి."

"మీరేమేనా వ్రాశారా వారికి?"

"ఇంకా లేదు. వారిదగ్గిరనుంచి ఉత్తరము వచ్చిన తర్వాతగా?"

"అవునుగాని, పంతులుగారూ! మీ అభిప్రాయమేమిటి?"

"నా అభిప్రాయమేనా యేమిటి మీకు కావలసినది?"

"సరే, తక్కిన సంగతులు మీ నాయనగార్ని అడిగి తెలుసుకుంటా. పిల్ల నచ్చినదీ లేనిదీ మీ విషయము కాదూ?"

"అదికూడా వార్నే కనుక్కోవచ్చు. పెద్దలు మీరు నన్నడగ వచ్చునా?"

"పిల్ల ఏమందండీ శాస్త్రులుగారూ?"

"శ్శు, నోరుముయ్యి."

"పిల్ల వప్పుకుంది. అందుకే మిమ్మల్నడిగాను."

"అయ్యా! క్షమించాలి. గాంధర్వ వివాహాల కాలము కాదిది, పిల్లా పిల్లాడూ వప్పుకుని ముడివెట్టేసుకోడానికి. కని పెంచిన తల్లి దండ్రు లుండగా పిల్ల వాణ్ణడగమని యెవరు చెప్పారు, మీకు?"

"అమ్మ! అసాధ్యులయ్యా మీరు. దైవయోగ మెలాగున్నదో?" అని వెళ్లిపోయాడు. వెంకట్రావు.

"ఏమిరోయి, ఎక్కడనేర్చుకున్నా వీపాఠాలు?"

"ఆఁ. చూడ్రా పెద్ద గడుస్తనముగా మొదలు పెట్టాడు. వలలో పడిపోతా ననే? తరవాత, 'పిల్ల వాడి క్లిష్టమే. తండ్రి కానిచ్చాడు కాదుగాని' అనడానికి."

"గాంధర్వాలమాట యెత్తి చెప్పేశావే నీ అభిప్రాయము?"

"అది గ్రహించేపాటి బుర్రఉందా ఈ మట్టి బుర్రలకి?"

* * * * *

రాత్రి భోజనాలదగ్గర.

"రెండు వేలా యిస్తాడు?"

"పట్టుపంచలూ, వెండిచెంబులూ అన్నీ కలిసి లాంఛనాల సహితముగా రెండువేలకి ముట్టచెప్పుతారట."

"పాపము. ముట్టచెప్పుతాడేం? మెట్టువాణ్ణి చూచుకోమనండి."

"సరే. అదంతా మనకెందుకూ?"

"మీ రేమన్నారూ?"

"'ఆలోచించి ఒకవారము రోజులలో చెప్పుతా' నన్నాను."

"ఆగుతారా అంతవరకూ వాళ్లు?"

"ఆగకపోతే వెళ్లనీ."

* * * * *

తరవాత రెండేళ్ల నాటిమాట. బి. యె. కి తర్వాత యం. బి. చదవడానికి విశాఖపట్టణము వెళ్లాను. శారదా బిల్లు అమలులోనికి రావడమువల్ల పెండ్లి సంబంధాల అలజడి తగ్గిపోయింది. మా కళాశాలసాంవత్సరోత్సవములో చిత్రనళీయము ప్రదర్శిస్తున్నాము. నేను సుదేవుడు. బాహుకుణ్ణిచూచిన తర్వాత ఆలోచన. "వ్రాయింతు నా కమ్మ పరగభీమునిచేత" అని స్త్రీలగుంపువైపు యాదాలాభంగా చూచాను. రెండు కళ్లు నావైపు తదేక దృష్టిగా చూస్తున్నాయి. ఏదో మెరుపు తగిలింది. వెనక్కి తిరిగి అందించేవాని సాయమువల్ల తక్కిన భాగము విలాగో లాగేశాను. తెరపక్కకివెళ్లి 'ఎవరో' అని చూచా. ఆఁ. ఆనాటిపిల్ల. మెళ్లో మంగళసూత్రా లున్నాయి. అగ్నిహోత్రము. ఆపక్క చూడకూడదు. ఆదర్శము మాటకేమిగాని నాటకము తగలడుతుంది.

* * * * *

వెంకటస్వామినాయుడుగారి ఫిడేలుకచేరీ. కదనకుతూహలము పూర్తిచేసి "రఘువంశ" అనేసాహిత్యానికి 'సరిమపదామప' అనే సమ్మేళనము వేశారు. "చభాష్" అన్నాను. అందరికళ్లూ నామీదపడ్డాయి. గప్పుమని తలవంచేసి కొంతసేపటికి మెల్లిగా ఎత్తాను. స్త్రీల గుంపులోంచి చొచ్చుకుని వచ్చిన రెండుకళ్లమీద పడింది నాదృష్టి. ఆకళ్లలో ఏదో ఆకర్షకశక్తి ఉంది. వెలుతురులోని పాదరసపుబుడ్లమీద కనబడే వెలుతురు చుక్కలా రెండు కళ్లల్లోనూ కనబడుతున్నాయి. కొంత సేపటికి ఆకళ్లు వాలిపోయాయి. ప్రేలితో కూర్చున్న వెదురుచాప ముక్కలు విరుస్తోం దాపిల్ల. కంటినుండి రెండుచుక్కలు రాలాయి. నాకెందుచేతనో కళ్లుమండాయి. గుడ్డపెట్టి రాని కన్నీరుని ఒత్తుతున్నాను. రాధాకృష్ణమూర్తి "ఏమిరా! అంత తన్మయుడవై పోయావు?" అన్నాడు. "అబ్బ, నలకరా ఊదుదూ" అన్నాను. ఊదాడు. ఇంతసేపూ ఒత్తిడిచేసిన కన్నీరు బయటికి వచ్చింది. ఏడుపుకి బదులు వెడనవ్వు వెలిపరిచాను.

"పోయిందా?"

"లేదురా! కళ్లు కడుక్కొస్తాను."

అని క్రిందికి వెళ్లడానికి బయలుదేరాను. ద్వారము దాటుతూ వెనక్కు చూసేసరికి స్త్రీలలోంచి ఆమెకూడా కిటికీదగ్గరకి వెళ్లింది. రాధాకృష్ణమూర్తి ఇది గమనించి కాబోలు, నావైపు చూచి, అరచేయి చూపించాడు. మేడమీద చీదుకునే మిషమీద కిటికీ దగ్గరచేరిన వ్యక్తి కళ్లు నన్ననుసరిస్తున్నాయి. రాధాకృష్ణమూర్తి చప్పట్లు కొట్టాడు, మేడమీదనుంచి. నేను నవ్వుతూనే రెండు వేళ్లు చూపించాను.

మర్నాడు ప్రొద్దునే హాస్పిటాల్ పనిమీద కాలేజీకి వెళ్లిపోయాను. నేను 'సి. వార్డు' లో ఉండగా బంట్రోతువచ్చి "పాపము, ఎవరో సముద్రములో జారి పోయారండీ, జుట్టు కనబడుతోంది. ఎవరూ తీయలేక పోతున్నా" రన్నాడు.

కాలేజీ పరుగుపందెములో నాదే బహుమతి అని చూపించాను. చాలామంది గుమికూడారు. ఇంతట్లోకి జనమంచి భాస్కర రామయ్యకూడా వచ్చి నీట్లోకి ఎగబడ్డాడు. తంటాలుపడి బయటికి తీశాము. నీళ్లు తాగేశింది. వాటిని బయటికి తోయించి, బలవంతో శ్వాసము కల్పించడానికి తంటాలు పడ్డాను. ముక్కు దగ్గర "వాసనవస్తారము" పెట్టాను. తుమ్మలేదు. కొంత సేపటికి కళ్లు విడ్డాయి. ఆ "కళ్లే". మెరుపులాంటిది క్షణకాలము ఆకళ్లలో ప్రసరించింది. నాడి చూచాను. లే...దు.

కళ్ల కామెమూర్తి కనబడుతోంది. ఆ మెరుపు కళ్లు, సన్నని పాపిడి,...ఇళ్లు గిర్రున తిరిగాయి. భూమి మీద పడబోయాను.

కళ్లు తెరిచి చూసేసరికి రాధాకృష్ణమూర్తి తొడ మీద నాతల ఉంది.

"ఎందుచేతరా, ఆమె నాది కాలేదు?"

"పెండ్లి కట్నము."

---

## మా చందాదారులకు

మా కార్యాలయమునకు వ్రాయు ఉత్తరములు మొదలయినవానియందు తమ 'చందాదారు' సంఖ్య వ్రాయువలెను. లేకున్న ప్రత్యుత్తరములు మొదలయిన పనులను జరుపజాలము. చందాదారుసంఖ్య భారతి కవరుకాగితముపై తమ విలాసమునకు ముందున్నది. చందాదారులకు భారతి ౧౦-వ తేది లోపల అందకపోయిన యెడల వెంటనే తపాలువారికిని, మా కార్యాలయమునకును తెలుప గోరెదము.

—మేనేజరు, 'భారతి.'